# ముఖారవిందం

రచన:
శ్రీ మానేపల్లి సత్యనారాయణ

ఎప్పుడూ లేంది, ఆరోజున, ఆరుకాకుండా మెలుకువొచ్చేసింది నాకు. గది కిటికీలోంచి చల్లని తెమ్మెరలు వచ్చి శరీరాన్ని మృదువుగా తాకుతున్నాయ్. బద్ధకంగా లేచి వళ్ళు విరుచుకుని కిటికి దగ్గరకెళ్ళి బయిటికి చూడనారంభించాను. కింద ఎదురుగుండా నూతిదగ్గర, ఒకమ్మాయి, పదిహేనేళ్ళ కంటె ఎక్కువవుండవు. నీళ్లు తోడుతోంది. తెల్లారి లేవగానే ఎంత అందమైన మొహం చూశాను! నాకు బోల్డు సంతోషమనిపించేసింది. నాకు తెల్లారి లేవగానే ఎవరిముఖమన్నా చూడ్డమంటే చెడ్డ భయం. కారణం - ఆ ముఖాన్నిబట్టి - ఆ రోజు తీరువుంటుందని నాకున్న ఒకానొక గట్టినమ్మకం. అందుకే యీ విషయంలో సాధారణంగా అతి జాగ్రత్తగా వుంటాను. అలాంటిది ఎందుకో యివాళిలా జరిగిపోయింది.

...ఎంత లేతవొళ్లు! ఎప్పుడూ లేంది యివాళ నీళ్లు తోడేందుకెందుకొచ్చిందో?...పాపం! వెళ్ళి సాయం చేద్దామనిపించి, తలపుని అతి కష్టంమీద అణుచుకున్నాను. అలాగే నిలబడ్డాను-కిటికీ లోంచి వచ్చే చల్లని గాలిని తింటూ. బిందె నిండింది. బిందె చంక నెత్తుకుని వయ్యారంగ నడుస్తూ వెళ్ళిపోయింది. ఆ లేత నడుం అల్లల్లాడుతోంటే మన సెందుకో వలల్లో చిక్కుంది, వెళ్ళిపోయిందిగదా అని మనసు చివుక్కుమంది, మళ్ళా వొస్తుందేమోనని యింకాసేపు అక్కడే నిలబడ్డాను. బ్రష్ తీసుకుని పళ్ళు తోముతూంటే, యిన్నాళ్ళనించీ ఆ రూంలో వుంటున్న నాకు తెలియని ) ఆ పిల్ల ఎవరై వుంటుందా అని ఆలోచిస్తూ, యింకొంతకాలం ఆ కిటికీ దగ్గిరే వచ్చేశాను. మళ్ళా ఆ పిల్ల రాలేదు.

'యింత అందంగా వున్న మొహాన్ని ఉదయమే చూశాను గనక, ఆరోజు తీరు యింకెంత బావుండాలి? అంటో లెక్కలు కట్టుకోవడం ప్రారంభించాను. మొదటిది...మనియార్డరు. వానికోసం మూడ్రోజునుంచీ ఎదురుచూస్తున్నాను. యివాళ రావొచ్చు, రెండు... యింకా యేవేవో 'ఆన్సర్లు' దొరికినయ్.

నా పక్క గదిలో వుంటున్న పంచముఖేశ్వరరావు యించుమించు ఏడుస్తూ బయటికొచ్చేడు. కుళాయిదగ్గిర స్నానం చేస్తున్న నేను 'అలా వున్నావేరా? అని అడిగాను, సంతోషంగా (ఎందుకో ఆ సంతోషం నాకు తెలీదు)

'అబ్బే! ఏంలేదురా! ఆ దొంగ వెధవ - లేవగానే ఆ దరిద్రపుగొట్టు వెధవ ముఖం చూశాను. ఏం జరుగుతుందో యేమోనని భయంగా వుంది. దుమ్ములగుండుతా గుండుముఖమూ వాడూనూ...' అన్నాడు నిద్రమత్తులోంచే భోరున ఏడుస్తూ.

నేను గొల్లున నవ్వాను. బిత్తరపోయి చూశాడు.

'యివ్వాళ నేను... వ్వెరీ బ్యూటిఫుల్ ఫేస్ చూశాననుకో. లైఫ్‌లో యింతసుక్రితం చూళ్లేదు. యికముందు చూడబోను. యిందాకే చూశాను.'

ఊరించాడు.

'ఎవర్రా అది?' అన్నాడు ఆతృతగా, మొహం చేటంత చేసుగుని, ఆవలిస్తూ.

'ఓ య్యంగ్ గర్ల్ - ఎదురుగా వున్న 'వెల్' దగ్గిర 'వాటర్' తోడితో కనిపించింది.'

'ఎవర్రా యిన్నాళ్ళనుంచీ కనిపించంది యివ్వాళ నీకు కనిపించింది?!

తనకా 'బ్యూటిఫుల్ యంగ్‌గర్ల్'ని చూసే భాగ్యం పోయినందుకూ, పైపెచ్చు ఆ 'దుమ్మల గుండు మొహం' చూసినందుకూ - రెండువిధాల వాడి బాధ. మళ్ళీ అంతట్లోనే ఆ మొహం జ్ఞాపకం వచ్చిందిగావును - యేడుపు మొహం (వాడు చూసిన మొహంకంటె వికృతంగా) పెట్టాడు.

నాకు బోల్డంత 'మెర్సీ' వేసేసింది.

'ఆఁ గాడిదగుడ్డు పోన్లెద్దూ. అదంతా జరుగుతుందా? యేడుస్తుందా? యేదో పూర్వాచారం? యిప్పుడటువంటివి పోయాయ్. యూడోంట్. యూడోంట్.' అని ఓదార్చాను, తుండుగుడ్డ పిండుకుంటూ.

తనకి దానిమీద అంతచేటు నమ్మకం కలగటానికి గల కారణాన్ని సోదాహరణంగా వివరించాడు, ఒకసారలాగే ఏదో వుద్యోగానికి 'యింటర్వ్యూ'కి వెళ్ళేరోజున ఒక పాకీ పిల్ల మొహం చూశాట్ట. ఆ రోజు వుద్యోగం రాలేదట. మళ్ళా పై చదువుకు కాలేజీలో చేరాడట?

నాకు మనసులో లోలోపల సంతోషం పొంగి పొర్లుతోంది. ఎంత పడితే అంత సరదాగా వుంది. మనియార్డరు వచ్చేసినట్టూ - అన్నట్టు చెప్పడం మర్చిపోయాను, యీ మధ్యనే ఓ కథరాసి 'కథాంజలి'కి పంపించాను. అది అచ్చయినట్టూ. ఏదో డబ్బు ముట్టినట్టూ-ఏవేవో ఊహలు అలా రేగుతున్నాయ్...

హోటలుకు వెళ్ళి 'టీ' తాగి మళ్ళీవచ్చి లాడ్జిలో కూచున్నాను. టైము కాగానే భోజనంచేసి కాలేజీకి బయల్దేరాను. పక్కరూం పంచముఖేశ్వరరావుగారు కాలేజీకి రాలేదు. కాఫీ తాగడానిక్కూడా వెళ్ళలేదు, ఉదయంనుంచే. కాలు తడిపితే ఏ అవాంతరంవొస్తుందోనని భయపడి పోయాడనుకున్నాను.

నేను వెళ్ళేసరికి కాలేజి నోటీసు బోర్డుదగ్గిర గుంపు కనిపించింది. అడిగితే ఎవరో బీ. యీ. డీ. స్టూడెంటు అకస్మాత్తుగా చచ్చిపోయిన కారణంగా ఆ రోజు 'లోకల్ హాలీడే' యిచ్చినట్టు చెప్పారు. ఆ రోజు మాకున్న జిడ్డు 'జి. యి.' పీరియడు పోయినందుకు సరదా పట్టలేక కిళ్ళీ నములుతూ లాడ్జికి బయల్దేరాం. కాలేజీకి (ఏదో విధంగా) సెలవు రావడం, పైగా 'జి.యి.' పీరియడ్ పోవడం - యీ రెంటినీ 'తత్సంబంధమయిన 'మంచి' కింద జమకట్టుకున్నాను.

'తెలుగు ఓల్డు పొయెట్రీ, చదవడం ప్రారంభించాను, ఆ అమ్మాయిని తలుచుకుంటో. ఏం జరిగిందో తెలియదు గాని తెలిసేసరికి, రిస్టువాచీ ముళ్ళు మూడును ముద్దెట్టుకుంటున్నాయి, ఘట్టాసయిన నిద్ర పట్టింది. మనసుకు చాలా హాయనిపించింది. ఈ మధ్య ఎన్నడూ అంత చక్కని నిద్రపట్టలేదు. దీన్ని మూడో'మంచి'గా జమకట్టేశాను. లేచి కొళాయిదగ్గిర మొహం కడుక్కుని కాస్త మంచిబట్టలు వేసుకున్నా - అలా పోయొద్దామని. అప్పణ్ణించి యిప్పటివరకూ 'పంచేశ్వరుడి' గది తెరవబడినట్టులేదు. 'పిచ్చివెధవ పాపం' అనుకుని జాలి పడేశాను. సరిగ్గా గదికి తాళం వేస్తొంటే, నిద్ర మొహంతో బయటికొచ్చాడు. గోక్కుంటూ.

'ఏమిట్రా! మరీ భయపడి పోతున్నావ్! ఫరవాలేదులే. నువ్వు మరీ చాదస్తపువాడిలా వున్నావ్!' అన్నాను-నా అదృష్టాన్ని మరోసారి మననం చేసుకుంటూ.

వాడా మాటలు వినిపించుకోలేదు.

చివరికి, ఆవలిస్తూ అన్నాడు—

'అన్నట్టు చెప్పడం మర్చిపోయినాను. నీకు మనియార్డరొచ్చింది. అరవై. నువ్వు కాలేజీ కెళ్ళినప్పుడొచ్చింది. యివ్వాళ కాలేజీకి వెళ్ళలేదు నేను. మనియార్డరు రేప్పొచ్చుకుందూగానిలే పోనీ—'

'య్యేవిఁటీ?' అన్నాను.

ఆ మనియార్డరు కోసం ఎన్నాళ్ళనుంచో - స్వాతి చినుకులకి ముత్యపు చిప్పలాగ .. నోరావలించుకూచున్నాను.

'మరి రాగానే చెప్పావ్ కాదే? వెంటనే పోస్టాఫీస్ కెళ్ళి పుచ్చుకుందును. యిప్పుడెలాగ? రేపు వాడు వచ్చిందాకా ఆగాలా? ఆ కాస్త చెప్పినంతట్లో అరిగిపోతావా నాడిమీద ఫైర్ అయ్యాను.

'ఓహోహో' యిదీ మరీ బావుంది: యివ్వాళేమి అఘాయిత్యం ముంచుకొస్తుందోని నేను హడిలిచస్తుంటే నీ యెగురుడేమిటి మధ్య?'

యిక అట్టె ఆలస్యంచేస్తే లాభంలేదు. యిప్పటికిప్పుడే నాలుగయిపోయింది. వాణ్ణి విసుక్కుంటూ గబగబా బయల్దేరాను-పోస్టాఫీసుకి. దార్లో తిరుమలరావు కనిపించాడు. బ్రతిమాలగా బ్రతిమాలగా ఓ అరగంటకి అనుగ్రహించాడు బాతాఖానీ నుంచి. వాడెప్పుడూ అంతే రెండి-రెండు గంటలకి తక్కువ బాతాఖానీ వాడి 'డిగ్నిటీ'కి భంగం.

మహ రష్‌గా వెళ్తున్నాను. నాలుగన్నర మించితే మరి యివ్వడులా వుంది-యవడైనా ఓ సైకిలిచ్చినా బావుణ్ణు. సైకిల్‌కి డాష్. అది నాకు డాష్ అయిందో, దానికి నేనే డాష్ అయ్యానో నాకుమటుకు తెలీదు. కాలు జెణికింది. 'ఇన్ ఎడిషన టుదట్' నయాపైస ప్రమాణంతో (చిన్న) పెచ్చు వూడింది. పోలీసు పరుగెత్తుకొచ్చాడు - లాఠీ ఎగరేసుకుంటో. (అది వాళ్ళ మామూలేగా)...యింకెందు కదంతా చెప్పడం. నానా ఖంగామా అయింది. అయిదు దాటుతోండగా నేనా గొడవలోంచి అతి కష్టంమీద దాటుకున్నాను. టిఫిన్ కని దాచుకున్న పావలా కాసుతో రిక్షాయెక్కి- 'లాడ్జీ'కొచ్చి పడ్డాను. మూతి బిగించేసుకుని పుస్తకం తెరిచి చదివేస్తున్నాను.

కోపం-రోషం - అసహ్యం-బాధ-అన్నీ...అన్నీ....

పంచముఖేశ్వరరావుగారు బెదుర్తూ బెదుర్తూ-హోటలుకు వెళ్లాడు-మెక్కేందుకు. కారేజీ వచ్చింది నాకు. ఈపూటతో టిక్కట్టయిపోయిందని చెప్పింది-సీత. ఖర్మ! యేం చేస్తాం???

పంచముఖేశ్వరరావుగారు యెప్పుడొచ్చారో యేమో-చప్పుడు కాకుండా లోపలికి పోయి తలుపు మూసుకున్నాడు. కాసేపుండి యేంచేస్తున్నాడో చూద్దామని వెళ్ళాను. తలుపు బారేసుకుని నోట్లు లెక్కపెడుతున్నాడు.

కర్రెన్సీ! కట్ట! ... నో...ఓ...ఓ...ట్లు ఎక్కడివి?

గబగబా ఎదురుగా గోడనివున్న కాళికాదేవి కాలెండరు ముందు మోకరిల్లి అతని చిన్న స్వరంలో విన్నవించుకోవడం ప్రారంభించాడు.

'దేవీ! దివ్యసంధాయినీ! యివ్వాళ ఆ 'దుమ్ముల గుండు' గాడి మొహం చూసినందుకు ఏమౌతోందోనని భయపడ్డాను. ఏమీ జరగలేదు-నీదయవల్ల. దేవీ...నీదయ వల్ల యే ఆపదా రాలేదు. యీ వందరూపాయలు పైగా దొరికినయ్ పర్సుతో సహా...నీ మహత్యం... దేవీ! దివ్యమూర్తీ!'

వణికిపోతున్నాడు-భక్తిభావంతో.

యింకా మెల్లగా గొణుగుతున్నాడు.

'పక్కరూము ప్రభాకరంగాడికి రేపుగూడా మనియార్డరు డబ్బు చేతబడకుండా చెయ్యి వాడిదగ్గర టిఫినుకూడా డబ్బులు లేవుగావును. నన్నడిగితే చస్తే యివ్వను. వాడికి కాస్త పొగరు అణగాలి. తప్పకుండా అలాచెయ్యి మాతా! మరో అరణా ఎక్కువ దక్షిణ చెల్లించుకుంటాను... వెధవకి అలాగే అవ్వాలి.

వాడు లోపల భక్తితో, డబ్బుతో - వణుకుతున్నాడు.

నేను బయట కోపంతో - కసితో, వణుకుతున్నాను.

ఛూత్! వెధవది! యివ్వాళంతా యింతే! ... మనసు వెనక్కి పరిగెట్టి ఉదయం కనిపించిన పిల్ల మొహంలో ఆగింది.

'మంచి'లకింద జమకట్టుకున్నవన్నీ తిరగేశాను.

అనవసరంగా ఒక సహచరుడి చావు కబురు విన్నాను. శనిగ్రహంగాడిలా చదువూ సంధ్యా లేకుండా పదకొండు నుంచి-మూడుంపావుదాకా నిద్రపోయినాను. పైపెచ్చు మనియార్డరందలేదు. దెబ్బలు తగిలినయ్. తెల్లారే నయాపైస దగ్గరలేదు. పక్కకి తిరిగితే కాలు కలుక్కుమన్నది...'అబ్బ'...

అందంగా, కనిపించిన ఆ ముఖారవిందం...ఎంతపని చేసింది. వాడు కోతిలాటి, పప్పురుబ్బే అయ్యరు మొహం చూశాడు. ముఖం! నా ముఖం!

అందమైన ముఖాల్లో ఎంతచిక్కు?!

నాకు మంచి పాఠం లభించింది.

అప్పణ్ణుంచి నాకు ముఖాల్లో నమ్మకం పోయింది. అందమైన వాళ్ళ ముఖాలు కల్మషంతో, కృతిమంతో, శనితో కనిపిస్తున్నాయ్!

*

మహేశ్వరీ పిక్చర్స్‌వారి

"అమూల్యకానుక" లో

పద్మిని, ఎం. కె. రాధా.

*

